# ఎవరు

పారిస్‌లో కౌంట్ బైజట్‌కు ఒక్కగా నొక్క కొడుకు ఎన్నాళ్ళకో పుట్టాడు పేరు బెల్డ్రి. లేక-లేక పుట్టాడని అబ్బురా కారంగా పెంచాడు. ఆడింది ఆటగా, పాడింది పాటగా అన్ని సౌకర్యాలు సమ కూర్చాడు. అందుకే కొరకరాని కొయ్యగా తయారై తండ్రికి మనోవ్యథ కలిగిం చాడు.

చదువు వంట బట్టలేదు సంస్కారం అబ్బలేదు. పెరిగే వయస్సుతో పాటు అహంకారం.. దాంబికం .... పెరగ నిచ్చాడు. ముక్కు మీద కోపం. తలంతా తిక్కతో నిండి పోయింది. ప్రతి వారిని తేలిగ్గా తీసి పారేయడం. హీనంగా మాట్లాడ్డం అతనికి పరిపాటి. ఈ ప్రపంచం అంతా తనకు కొట్టిన పిండి అని మిడిసి పాటు.

నౌకర్లను కొట్టి, ఇరుగు పొరుగు వారితో కజ్జాలు పెట్టుకొని మిడిమేలప్పు దొర అయ్యాడు. తాగుబోతు తిరుగు బోతు. స్నేహితుల్లేరు-హితుల్లేరు. సన్ని హితులు అంతకన్నా లేరు. ఉన్నదల్లా 'నేను' అనే ఒక్క మొండి ధీమా.

అందమైన అమ్మాయితో పెండ్లి జరి గింది కొన్నాళ్ళపాటు కుదురుగా వున్నట్టు కనుపించినా మళ్ళా మామూలు ధోరణే సాగింది మనవడు పుట్టబోతున్నట్టు బైజట్‌కు వర్తమానం అందింది. ఎన్నాళ్ళ బట్టో ఎదురు చూస్తున్న సుమూహూర్తం వచ్చేసినట్టు బైజట్ అనుకొన్నాడు. ఆ రోజు రాత్రి 2 గంటలకు పుత్రోదయం అయింది.

టిప్-టాప్‌గా ముస్తాబై పొద్దున్నే కొడుకును చూడ్డానికి బెల్డ్రి బయలు దేరాడు. గదిలోకి వచ్చి చూసేసరికి రెండు ఉయ్యాలల్లో ఇద్దరు పాపలు ఉన్నారు. ఒకే రకం దుస్తులు వేసి వున్నాయి. ఒక పాపడు రెండెలా అయ్యారు. ఇందులో తన బిడ్డ ఎవరు? ఎలా గుర్తు పట్టడం?

ఈ ఆలోచనల్లో అతనికి కోపం వచ్చింది. నౌకర్లపై ఒంటి కాలితో లేచాడు శివ మెత్తిన వాడిలా చిందులు తొక్కి పిచ్చిగా అరిచి ఇల్లంతా గగ్గోలు చేశాడు.

ఇంతలో బైజట్ వచ్చి "ఏంట్రా ఈ అంకమ్మ శివాలు!" అన్నాడు

"ఇదేదో మాయగా వుంది నాన్నా! ఎవరు చేశారు? ఎందుకు చేశారు? ఇందులో నీ మనమడు ఎవరని?" అన్నాడు.

పక-పకా నవ్వుతూ "సర్వజ్ఞుడవని డబ్బా మోగించేవాడి కదరా! నీ కన్న

# గొప్ప?

కొడుకు ఎవరో కూడా గుర్తించలేవా? ఎవరిలో నీ నెత్తురు పారుతుందో నీ బోడి తెలివి తెలివి తేటలతో కనిపెట్టలేక పోయావా?.... షేమ్! షేమ్! నువ్వొట్టి శుంఠవేనన్న మాట!" అన్నాడు ఎగతాళి చేస్తూ.

"అదేంటి నాన్నా! అంతేసి మాట లంటారు...." అన్నాడు చిన్నబుచ్చు కొంటూ.

బ్రైజట్ ఉయ్యాల దగ్గరకొచ్చి "ఇదుగో వీడు నీ కొడుకు. కాలి వేలికి ఓ తాడు కట్టి వుంది చూడలేదట్రా చవటా? ఈ గుర్తు లేకపోతే నాకూ నీ అవస్థ పట్టేది. విద్యల విడి మిడిసిపాటు తగదని, నీకు బుద్ధి చెప్పాలని నేనే యీ ప్లాన్ వేశా...." అన్నాడు.

కొన్నాళ్ళకు బెల్జాక్ జబ్బున పడ్డాడు. డాక్టర్ ఆపరేషన్ చేయాలన్నాడు. కాకతాళీయంగా బ్రైజట్ నౌకర్లలో ఒకడికి ఇంచుమించు అదే జబ్బు చేసింది ఇద్దరికీ ఆపరేషన్ జరిగింది. బ్రైజట్ కోరికపై డాక్టరు ఇద్దరి రక్తాన్ని వేరు-వేరు పాత్రల్లో కొంచెం పోసి పెట్టాడు.

"డాక్టర్? ఈ రెండిటిలో ఏది స్వచ్ఛమైన రక్తమో పరీక్ష చేసి చెప్పండి!" అని అడిగాడు బ్రైజట్. కాసేపటి తర్వాత డాక్టర్ టెస్ట్ చేసి "ఈ పచ్చగాజు పళ్లెంలోది చాలా 'ప్యూర్'!" అన్నాడు.

"ఒరేయ్! అది నీ రక్తం అనుకొంటున్నావేమో! కాదు. ఇది నీ వద్ద వెట్టి చాకిరిచేసి బ్రతికే నీ నౌకరుది నీ నెత్తురు కన్నా స్వచ్ఛంగా వుందట విన్నావా? ... అందుకు కారణమేంటో తెలుసా? నీ నౌకరుకు అహంభావం లేదు. సౌమ్యుడు. శాంతపరుడు మెత్తని మనస్సు కలవాడు. ప్రకృతికి అనుగుణంగా ఊపిరి పీల్చే సహజమైన జీవి. ప్రవృత్తిని బట్టి-ప్రవర్తన బట్టిరా చిన్నా పెద్దా! డబ్బును, హోదాను బట్టి కాదోయ్! తన విధిని సక్రమంగా నిర్వర్తిస్తూ. చేసే సేవలో తృప్తి పడుతూ అంచెలంచెలుగా ఎదిగిస్తూ వుంటాడు. అట్టి వాళ్ళు నూరేళ్ళు బ్రతుకుతారు చేసే పని ఏదైనా, జీవించే జీవితం ఎలాంటిదైనా వారి-వారి తాత్విక శైలిని బట్టి మనిషి సుఖపడి ఇతర్లను సుఖపెట్ట కలుగుతాడు. ఈ జీవిత సత్యాన్ని చచ్చేంత వరకూ మరిచిపోకు. తెలిసిందా?...." అన్నాడు బ్రైజట్.

—కొల్లుకుదురు రాజశేఖరరెడ్డి.